

WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



నవంబర్ 1 ఆదివారం 2026 | సంపుటి : 18 | సంచిక : 266 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

SUNDAY NOVEMBER 1 2026 | VOL:18 | ISSUE: 266 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

ఐడీబీఐ ఉద్యోగుల ఆందోళనలను ఎందుకు పట్టించుకోవడం లేదు..? కేంద్రం తీరుపై కేటీఆర్ ప్రశ్నలు

ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వ రంగ బ్యాంకులు పరిరక్షించాల్సిన జాతీయ ఆస్తులని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటైజేషన్ నిలిపేయాలన్న తమ విజ్ఞప్తికి, ఆందోళనకు మద్దతు తెలపాలని ఆల్ ఇండియా ఐడీబీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేస్తూ.. తనకు ట్యాగ్ చేసిన అంశంపై కేటీఆర్ స్పందించారు. ఐడీబీఐ బ్యాంకు విలువను తక్కువగా అంచనా వేస్తున్నారన్న నివేదికలు నిజంగా ఆందోళన కలిగిస్తున్నాయని కేటీఆర్ అన్నారు. ఈ మేరకు కేంద్రానికి కేటీఆర్ పలు ప్రశ్నలు సంధించారు. బిడ్‌లు రిజర్వ్ ధర కంటే తక్కువకు పడిపోయినప్పుడు, నిబంధనలను, విలువ నిర్ధారణ పద్ధతిని ఎందుకు మార్చారన్నారు. ఐడీబీఐకి హైదరాబాద్‌లోని ప్రధాన భూమితో సహా విలువైన స్థిరాస్తి ఆస్తులు కూడా ఉన్నాయి. మరి వాటి విలువను సరిగ్గా లెక్కించారా..? ఐడీబీఐ ఉద్యోగులు లేవలెత్తిన ఆందోళనలను ఎందుకు పట్టించుకోవడం లేదు..? ఒక ప్రతిష్మాత్మక ప్రభుత్వ రంగ బ్యాంకును ప్రైవేట్ సంస్థలకు అమ్మే ముందు, కేంద్ర ప్రభుత్వం దేశానికి కొన్ని సూటి సమాధానాలు ఇవ్వాలి.. ఎందుకంత తొందర..? అని కేటీఆర్ ప్రశ్నించారు. దేశానికి పేరున్న ప్రభుత్వ రంగ బ్యాంకును ప్రైవేట్ సంస్థకు అప్పగించే ముందు కేంద్ర ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన సమాధానాలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. దేశ ప్రజల ఆస్తులైన ప్రభుత్వ రంగ సంస్థల విలువ, భవిష్యత్తు విషయంలో పారదర్శకత ఎందుకు పాటించడం లేదు..? అని కేంద్రాన్ని అడిగారు.



ఇస్రో ప్రయోగం సక్సెస్.. శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ అభినందనలు


- జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ ద్వారా ఎన్‌వీఎస్-03 ఉపగ్రహం విజయవంతం
- ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు ప్రధాని మోదీ అభినందనలు
- స్వదేశీ నావిగేషన్ వ్యవస్థ 'నావిక్' బలోపేతం అవుతుందని వెల్లడి
- కీలక సాంకేతికతల్లో ఆత్మనిర్భరతకు ఈ ప్రయోగం దోహదపడుతుందని వ్యాఖ్య

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఖాతాలో మరో అద్భుత విజయం చేరింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలో ఉన్న సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ ద్వారా ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల బృందాన్ని ఆయన అభినందించారు.ఈ సందర్భంగా ప్రధాని మోదీ సోషల్ మీడియా



బంగాళాఖాతంలో రేపు సాయంత్రానికి తుపాను.. ఏపీలో భారీ నుంచి అతి భారీ వర్షాలు


- బంగాళాఖాతంలో మరింత బలపడిన అల్పపీడనం
- రేపటికి తుపానుగా మారే అవకాశం
- సోమ, మంగళవారాల్లో ఏపీలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు
- తీరం వెంబడి బలమైన ఈదురు గాలులు వీచే సూచన
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని ప్రభుత్వ హెచ్చరిక



ఆంధ్రప్రదేశ్‌కు మరో తుపాను ముప్పు పొంచి ఉంది. ఆగ్నేయ బంగాళాఖాతం, దాని పరిసరాల్లోని (మిగతా 2వ పేజీలో..)

తెలంగాణకు ఐదు రోజుల వర్ష సూచన.. పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్

- అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో ఐదు రోజుల వర్ష సూచన
- నేటి నుంచి నవంబర్ 4 వరకు వానలు కురిసే అవకాశం
- హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం



అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో రానున్న ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. నేటి నుంచి నవంబర్ 4వ తేదీ వరకు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది.వాతావరణ శాఖ నివేదిక ప్రకారం, (మిగతా 2వ పేజీలో..)

హైదరాబాద్‌లో హైడ్రా చర్యలు.. రామాంతపూర్ పెద్ద చెరువు వద్ద కూల్చివేతలు

- రామాంతపూర్ పెద్ద చెరువు వద్ద నిర్మాణాల కూల్చివేత
- చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని తెలిపిన అధికారులు
- 40 ఏళ్లుగా పన్నులు కడుతున్నామంటున్న యజమానులు
- అధికారుల చర్యలపై హైకోర్టును ఆశ్రయించిన బాధితులు

హైదరాబాద్‌లోని రామాంతపూర్‌లో ఉన్న పెద్ద చెరువు వద్ద ఉద్రిక్తత నెలకొంది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలను 'హైడ్రా' అధికారులు కూల్చివేశారు. చెరువు స్థలాన్ని ఆక్రమణల నుంచి కాపాడే చర్యల్లో (మిగతా 2వ పేజీలో..)



తేని జైలు ఘటనపై సీఎం విజయ్ సీరియస్.. అధికారులకు కీలక ఆదేశాలు

- తేని జైలు నుంచి 17 మంది ఖైదీలు పరారైన ఘటన
- జైలు సూపరింటెండెంట్ నాగేశ్వరన్‌పై సస్పెన్షన్ వేటు
- రాష్ట్రవ్యాప్తంగా జైళ్లలో భద్రత పెంచాలని సీఎం విజయ్ ఆదేశం
- విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలని హెచ్చరిక



తమిళనాడులోని తేని జిల్లా జైలు నుంచి 17 మంది విచారణ (మిగతా 2వ పేజీలో..)

ఎల్‌నినో ఎఫెక్ట్.. తాగునీటి కోసం రూ.120 కోట్లు.. మంత్రి సీతక్క కీలక నిర్ణయం

- ఎల్‌నినో ప్రభావం ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు
- ఇతర జిల్లాలకు ఒక్కోటి రూ.కోటి చొప్పున నిధులు
- బోరుబావులు, ట్యాంకర్లతో నీటి సరఫరాకు ఏర్పాట్లు
- స్థానిక నీటి వనరులను అందుబాటులో ఉంచాలని ఆదేశం



ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్ల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో సింగూరు ప్రత్యామ్నాయ తాగునీటి అవసరాల కోసం రూ.120 కోట్లు కేటాయించినట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. ఇతర జిల్లాల్లో తక్షణ అవసరాల కోసం ఒక్కో జిల్లాకు రూ.కోటి (మిగతా 2వ పేజీలో..)

రేవంత్ రెడ్డి అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్..భూములను కాపాడిందే బీఆర్ఎస్ : మాజీ మంత్రి హరీష్‌రావు

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మియాపూర్ భూముల విషయంలో బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించారు. రేవంత్ రెడ్డి అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచిపోనున్నారని దుయ్యబట్టారు. సీఎంకు అబద్ధాల్లో ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని వ్యాఖ్యనించారు.మియాపూర్ భూములు తెలంగాణ ప్రభుత్వానికి చెందినవేనని సుప్రీంకోర్టు వెల్లడించిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. అబద్ధాలతో క్రెడిట్ చోరీలకు పాల్పడుతున్నారని విమర్శించారు. మియాపూర్ భూముల విషయంపై సుప్రీం కోర్టు జడ్జిమెంట్ కాపీ కూడా ఇంకా రాకముందే ఆ భూములను అమ్ముకోవాలనే ఆతృత సీఎంలో కనిపించిందని ఆరోపించారు.కేసీఆర్ సీఎం (మిగతా 2వ పేజీలో..)



విజయకేరటం
తెలుగు దినపత్రిక

సం పా దకీయం

పర్యావరణ పరిరక్షణ.. ప్రతి పౌరుడి బాధ్యత!

ప్రకృతి మనిషికి అందించిన అపురూపమైన సంపద గాలి, నీరు, నేల, అడవులు, నదులు, పర్వతాలు. వీటిపైనే సమస్త జీవరాశి మనుగడ ఆధారపడి ఉంది. మానవ అభివృద్ధి పేరుతో సహజ వనరులను విచ్చలవిడిగా వినియోగించడం, అడవులను నరికివేయడం, జలవనరులను కలుషితం చేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్లక్ష్యంగా పారవేయడం వంటి చర్యలు పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయి. ప్రకృతిపై మనిషి చూపుతున్న నిర్లక్ష్యం చివరకు మానవ మనుగడకే ముప్పుగా మారే ప్రమాదం ఉంది. అందుకే పర్యావరణ పరిరక్షణను ఒక ప్రత్యేక కార్యక్రమంగా కాకుండా ప్రతి ఒక్కరి దైనందిన బాధ్యతగా గుర్తించాలి.

అభివృద్ధి పేరుతో ప్రకృతికి నష్టం వద్దు

పట్టణీకరణ, పారిశ్రామికీకరణ దేశ ఆర్థిక అభివృద్ధికి అవసరమే. కొత్త రహదారులు, భవనాలు, పరిశ్రమలు, మౌలిక వసతులు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచగలవు. అయితే అభివృద్ధి ప్రణాళికల్లో పర్యావరణానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. చెరువులు, అడవులు, సహజ నీటి ప్రవాహ మార్గాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే భవిష్యత్తులో వరదలు, నీటి కొరత, ఉష్ణోగ్రతల పెరుగుదల వంటి సమస్యలు తీవ్రమవుతాయి.ప్రతి అభివృద్ధి ప్రాజెక్టులో పర్యావరణ ప్రభావాన్ని అంచనా వేయాలి. సహజ వనరులను కాపాడుతూ నిర్మాణాలు చేపట్టే విధానాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. తాత్కాలిక ప్రయోజనాల కోసం దీర్ఘకాలిక పర్యావరణ నష్టాన్ని కొనితెచ్చుకోవడం వివేకవంతమైన చర్య కాదు.

అడవుల పరిరక్షణతోనే జీవ వైవిధ్యానికి రక్షణ

అడవులు వర్షపాతం, నేల సంరక్షణ, వాతావరణ సమతుల్యతలో కీలక పాత్ర పోషిస్తాయి. అనేక వన్యప్రాణులకు అవే సహజ నివాసాలు. అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం వల్ల జీవ వైవిధ్యం దెబ్బతింటోంది. మానవులు అడవుల్లోకి విస్తరించడం, అక్రమ వేట, అటవీ ప్రాంతాల్లో ఆక్రమణలు వన్యప్రాణుల మనుగడకు ముప్పుగా మారుతున్నాయి. అడవులను కాపాడటం అటవీ శాఖ బాధ్యత మాత్రమే కాదు. స్థానిక ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు కూడా భాగస్వాములు కావాలి. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించి చెట్లుగా పెంచే బాధ్యత తీసుకోవాలి. అడవుల విస్తీర్ణాన్ని పెంచడంతో పాటు సహజ అటవీ వ్యవస్థలను పరిరక్షించాలి.

ప్లాస్టిక్ కాలుష్యానికి అడ్డుకట్ట వేయాలి

ప్లాస్టిక్ వినియోగం ఆధునిక జీవితంలో విస్తృతమైంది. తక్కువ ధర, సౌలభ్యం కారణంగా ఒకసారి ఉపయోగించి పారవేసే ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పెరుగుతోంది. ఇవి నేలలో, నీటిలో సులభంగా కలిసిపోకుండా దీర్ఘకాలం పేరుకుపోతాయి. కాలువల్లో చేరి నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడమే కాకుండా జలచరాలకు కూడా హాని కలిగిస్తాయి.ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ బట్ట సంచులు, పునర్వినియోగ వస్తువులను ఎంచుకోవాలి. దుకాణాలు, హోటళ్లు, వాణిజ్య సంస్థలు కూడా పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలి. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా వేరు చేసి అందించే అలవాటు పెరగాలి. నిబంధనల అమలుతో పాటు ప్రజల్లో నిరంతర అవగాహన అవసరం.

నీటి వనరులను కాపాడుకోవాలి

ప్రకృతి సమతుల్యతలో నీటి వనరులకు ప్రత్యేక స్థానం ఉంది. చెరువులు, కుంటలు, నదులు, వాగులు భవిష్యత్తు తరాలకు అందించాల్సిన సహజ సంపద. కానీ ఆక్రమణలు, మురుగునీటి ప్రవాహం, పారిశ్రామిక వ్యర్థాల వల్ల అనేక జలవనరులు కాలుష్యానికి గురవుతున్నాయి. నీటి వనరులను కాపాడకపోతే తాగునీరు, సాగునీటి కొరత మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. వర్షపు నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పెంపు, మురుగునీటి శుద్ధి వంటి చర్యలను సమర్థంగా అమలు చేయాలి. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలు శుద్ధి చేసిన తర్వాతే జలవనరుల్లోకి చేరేలా పర్యవేక్షణ ఉండాలి. నీటిని పొదుపుగా వినియోగించడం ప్రతి కుటుంబం అలవాటు చేసుకోవాలి.

వాతావరణ మార్పులపై ముందస్తు జాగ్రత్తలు

ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన వేడిగాలులు, మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలు, కరువు పరిస్థితులు ప్రజల జీవనాన్ని ప్రభావితం చేస్తున్నాయి. రైతులు, పశుపోషకులు, మత్స్యకారులు, ప్రకృతిపై ఆధారపడిన వృత్తులవారు ఎక్కువగా నష్టపోయే అవకాశం ఉంది.వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి ప్రభుత్వాలు దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించాలి. పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచాలి. సౌర, పవన విద్యుత్ వంటి ప్రత్యామ్నాయాలపై పెట్టుబడులు ప్రోత్సహించాలి. పట్టణాల్లో పచ్చదనం పెంచడం, నీటి వనరులను కాపాడటం, కాలుష్య నియంత్రణ చర్యలను బలోపేతం చేయడం అవసరం.

పర్యావరణ విద్యకు ప్రాధాన్యం

పర్యావరణ పరిరక్షణపై అవగాహన చిన్న వయసు నుంచే కల్పించాలి. పాఠశాలల్లో మొక్కల పెంపకం, నీటి పొదుపు, చెత్త వేరు చేయడం, ప్రకృతి పరిశీలన వంటి కార్యక్రమాలు నిర్వహించాలి. విద్యార్థులకు పర్యావరణ సమస్యలను పుస్తకాలకే పరిమితం చేయకుండా ఆచరణలో చూపించాలి.కళాశాలలు, యువజన సంఘాలు, స్థానిక సంస్థలు కూడా పర్యావరణ కార్యక్రమాల్లో పాల్గొనాలి. మొక్కలు నాటే కార్యక్రమాలతో పాటు వాటి సంరక్షణకు బాధ్యతలు కేటాయించాలి. శుభ్రత, నీటి సంరక్షణ, ప్లాస్టిక్ నియంత్రణ వంటి అంశాల్లో ప్రజల భాగస్వామ్యం పెంచాలి.

ప్రభుత్వాల బాధ్యత.. ప్రజల భాగస్వామ్యం

పర్యావరణ చట్టాలను రూపొందించడం మాత్రమే సరిపోదు. వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయడం అత్యంత ముఖ్యం. కాలుష్యానికి కారణమయ్యే సంస్థలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. పరిశ్రమల కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. అక్రమ చెట్ల నరికివేత, జలవనరుల ఆక్రమణ, వ్యర్థాల అక్రమ పారవేతను అరికట్టాలి.అదే సమయంలో ప్రజలు కూడా తమ పరిసరాల్లో జరిగే పర్యావరణ నష్టాన్ని గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. ప్రభుత్వాన్ని మాత్రమే ప్రశ్నించడం కాకుండా తమ వంతు బాధ్యతను కూడా నిర్వర్తించాలి. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ పర్యావరణ కార్యక్రమమూ పూర్తిస్థాయిలో విజయవంతం కాలేదు.

భావితరాలకు ప్రకృతి సంపదను అందించాలి

ప్రకృతి మనకు పూర్వీకుల నుంచి వచ్చిన వారసత్వ సంపద మాత్రమే కాదు.. భావితరాలకు అందించాల్సిన బాధ్యత కూడా. నేటి అవసరాల కోసం సహజ వనరులను పూర్తిగా వినియోగిస్తే రేపటి తరాలకు తీవ్ర సమస్యలు ఎదురవుతాయి. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ సమాంతరంగా సాగినప్పుడే సమాజం సుస్థిరంగా ఎదుగుతుంది. ప్రకృతిని కాపాడటం అంటే మన జీవితాలను, మన ఆరోగ్యాన్ని, మన భవిష్యత్తును కాపాడుకోవడమే. ఒక్క మొక్క నాటడం, ఒక చుక్క నీటిని ఆదా చేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి చిన్న చర్యలే సమిష్టిగా గొప్ప మార్పును తీసుకురాగలవు. ప్రభుత్వాలు బాధ్యతగా వ్యవహరించాలి.. పరిశ్రమలు పర్యావరణ నిబంధనలు పాటించాలి.. ప్రజలు ప్రకృతి సంరక్షణలో భాగస్వాములు కావాలి. ప్రకృతి ఉంటేనే ప్రగతి ఉంటుంది. పచ్చదనం ఉంటేనే జీవితం ఉంటుంది. భావితరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించడమే మనందరి లక్ష్యం కావాలి!

ఇస్రో ప్రయోగం సక్సెస్.. శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ అభినందనలు

మొదటి పేజీ తరువాయి)

ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. "జీఎస్ఎల్వీ-ఎఫ్18 ద్వారా ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు నా అభినందనలు. మన స్వదేశీ నావిగేషన్ వ్యవస్థ 'నావిక్'ను బలోపేతం చేయడంలో ఈ ప్రయోగం ఒక ముఖ్యమైన ముందడుగు" అని ఆయన పేర్కొన్నారు. అత్యాధునిక సామర్థ్యాలతో కూడిన ఈ ఉపగ్రహం, కీలక సాంకేతికతల్లో దేశం ఆత్మనిర్భరత సాధించేందుకు మరింత దోహదపడుతుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన నావిగేషన్ సేవలు అందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. మన అంతరిక్ష శాస్త్రవేత్తల అంకితభావం, నైపుణ్యం దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నాయని మోదీ కొనియాడారు.'నావిగేషన్ విత్ ఇండియన్ కాన్స్టలేషన్' (నావిక్) అనేది భారత్ సొంతంగా అభివృద్ధి చేసుకున్న ప్రాంతీయ నావిగేషన్ వ్యవస్థ. అమెరికాకు చెందిన జీపీఎస్ తరహాలోనే ఇది పనిచేస్తుంది. దేశ భద్రత, రవాణా, విపత్తుల నిర్వహణ, పౌర సేవలు వంటి అనేక రంగాల్లో కచ్చితమైన పొజిషనింగ్, టైమింగ్ సేవలను అందించడం దీని లక్ష్యం. ప్రస్తుతం ప్రయోగించిన ఎన్‌వీఎస్-03, నావిక్ కోసం రూపొందించిన రెండో తరం ఉపగ్రహాల్లో ఒకటి. ఇది నావిక్ వ్యవస్థకు మరింత శక్తిని అందించి, దాని సేవలను మరింత విస్తృతం చేయనుంది. ఈ ఉపగ్రహంలో స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన అటామిక్ క్లాక్ ఉండటం విశేషం. ఈ విజయంతో అంతరిక్ష రంగంలో స్వావలంబన దిశగా భారత్ మరో కీలక ముందడుగు వేసినట్లయింది.

ఎల్‌నినో ఎఫెక్ట్.. తాగునీటి కోసం రూ.120 కోట్లు.. మంత్రి సీతక్క కీలక నిర్ణయం

మొదటి పేజీ తరువాయి)

చొప్పున నిధులు ఆమోదించినట్లు తెలిపారు.రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై శనివారం ఉదయం మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి ఎద్దడి ఎదురయ్యే ప్రాంతాల్లో స్థానిక నీటి వనరులను వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట బోరుబావులను అద్దెకు తీసుకోవడంతో పాటు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు రవాణా ఏర్పాట్లు చేయాలని సూచించారు.చేతిపంపులు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ నీటి సరఫరా పథకాలు, బావులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మిషన్ భగీరథ సరఫరాకు అంతరాయం ఏర్పడే గ్రామాలు, భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. నీటి పొదుపు, ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ఇటీవల హైదరాబాద్, మేడ్చల్, ఖమ్మం, యాదాద్రి తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని సీతక్క సూచించారు. తాగునీటి వనరుల వద్ద ఉన్న ఇంకుడు గుంతలు, మ్యాజిక్ పిట్లలోకి నీరు చేరేలా చూడాలని, నిర్మాణంలో ఉన్న పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

తెలంగాణకు ఐదు రోజుల వర్ష సూచన.. పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్

మొదటి పేజీ తరువాయి)

అల్పపీడనం వాయుగుండంగా బలపడి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదులుతోంది. దీని ప్రభావంతో ఈరోజు సాయంత్రం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలతో పాటు యాదాద్రి భువనగిరి, సిద్దిపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. రేపు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు పడతాయని అంచనా వేసింది.ముఖ్యంగా నవంబర్ 2, 3 తేదీల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. నవంబర్ 2న ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో, నవంబర్ 3న నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడతాయని పేర్కొంది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు మెరుపుల సమయంలో సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని అధికారులు సూచించారు.

తెలంగాణకు ఐదు రోజుల వర్ష సూచన.. పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్

మొదటి పేజీ తరువాయి)

అయ్యాక వైద్యనాథన్ అనే సీనియర్ అడ్వకేట్‌ను నియమించి భూములు ప్రభుత్వానికి దక్కేలా న్యాయపోరాటం చేసి కాపాడారని గుర్తు చేశారు. మంచిరేవులలో 142 ఎకరాలు కాపాడామని గొప్పలు చెప్పుకుంటే కాంగ్రెస్ ఆ భూములు ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేలా ప్రయత్నించిందని పేర్కొన్నారు. మంచిరేవుల్లోని 10 ఎకరాల భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని విమర్శించారు. భూపాలపల్లి భూములు, హయాత్‌నగర్‌లోని భూములను కాపాడేందుకు బీఆర్ఎస్ అన్నిరకాలుగా కాపాడిందని ఆరోపించారు. సెంట్రల్ యూనివర్సిటీ భూములను తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్లను రేవంత్ రెడ్డి అప్పుగా తెచ్చుకున్నారని వెల్లడించారు.

తేని జైలు ఘటనపై సీఎం విజయ్ సీరియస్.. అధికారులకు కీలక ఆదేశాలు


మొదటి పేజీ తరువాయి)

ఖైదీలు పరారైన ఘటనపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. ఈ ఘటనలో బాధ్యులను చేస్తూ తేని జైలు సూపరింటెండెంట్ నాగేశ్వరన్‌ను సస్పెండ్ చేయగా, మరో సీనియర్ అధికారిని బదిలీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జైళ్లలో భద్రతను కట్టుదిట్టం చేయాలని, నిఘాను పటిష్ఠం చేయాలని ముఖ్యమంత్రి విజయ్ ఉన్నతాధికారులను ఆదేశించారు.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. తేని జైలు సూపరింటెండెంట్ నాగేశ్వరన్‌ను అక్టోబర్ 30 నుంచి తదుపరి ఆదేశాలు జారీ చేసేంతవరకు సస్పెండ్ చేశారు. అదేవిధంగా మధురై సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌గా ఉన్న ఆర్. కృష్ణరాజ్‌ను సేలం సెంట్రల్ జైలుకు బదిలీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని సీఎం విజయ్ హెచ్చరించారు.అక్టోబర్ 26న తేని జిల్లాలోని టెక్కంపట్టి సబ్-జైలులో ఈ ఘటన జరిగింది. వైద్యపరమైన అత్యవసర పరిస్థితిని సృష్టించిన ఖైదీలు, జైలు గార్డులపై దాడి చేసి, వారి నుంచి తాళాలు లాక్కుని పరారయ్యారు. ఈ ఘటనపై వెంటనే స్పందించిన పోలీసులు, ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి పరారైన 17 మందినీ తిరిగి పట్టుకున్నారు. ఈ జైలు బ్రేక్ ఘటనతో రాష్ట్రవ్యాప్తంగా జైళ్ల భద్రతపై ప్రభుత్వం సమీక్ష ప్రారంభించింది. ఇప్పటికే ఈ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలపై 9 మంది జైలు సిబ్బందిని సస్పెండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిఘా వ్యవస్థను మెరుగుపరచడం, మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం వంటి చర్యలు చేపడుతున్నారు.

బంగాళాఖాతంలో రేపు సాయంత్రానికి తుపాను.. ఏపీలో భారీ నుంచి అతి భారీ వర్షాలు

మొదటి పేజీ తరువాయి)


అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారింది. ఇది రేపు (ఆదివారం) సాయంత్రానికి తుపానుగా రూపాంతరం చెందే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది.పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతున్న ఈ వాయుగుండం, సోమవారం (నవంబర్ 2) సాయంత్రం నాటికి పశ్చిమమధ్య బంగాళాఖాతంలో ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపంలోకి చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా సోమ, మంగళవారాల్లో సెంట్రల్ ఆంధ్రా, రాయలసీమ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, కొన్నిచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) ప్రజలను అప్రమత్తం చేసింది. తుపాను ప్రభావంతో తీరం వెంబడి గంటకు 45 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని, సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని తెలిపింది. అందువల్ల మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ సముద్రంలో వేటకు వెళ్లరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని ఏపీఎస్‌డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. అధికార యంత్రాంగం అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటోందని, ప్రజలు కూడా ప్రభుత్వ సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.



హైదరాబాద్‌లో హైడ్రా చర్యలు.. రామాంతపూర్ పెద్ద చెరువు వద్ద కూల్చివేతలు

మొదటి పేజీ తరువాయి)

భాగంగా ఈ కూల్చివేతలు చేపట్టినట్లు తెలుస్తోంది.ఇందులో భాగంగా ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో ఉన్న ఓ భారీ షెడ్డును అధికారులు తొలగించారు. అధికారుల చర్యలతో తాము తీవ్రంగా నష్టపోయామని ఆస్తుల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 40 ఏళ్లుగా తాము క్రమం తప్పకుండా పన్నులు, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామని వారు తెలిపారు. గత మూడు రోజులుగా అధికారులు సర్వేలు నిర్వహిస్తున్నారని, ఈ నేపథ్యంలోనే తాము హైకోర్టును ఆశ్రయించామని బాధితులు వివరించారు.ముందుగా చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను స్పష్టంగా నిర్ణయించాలని, ఆ తర్వాతే చట్టపరమైన తమ భూములపై చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గతంలోనూ ఇదే చెరువు పరిధిలో కూల్చివేతలు చేపట్టి, కొంత భూమిని పునరుద్ధరణ పనుల కోసం అధికారులు స్వాధీనం చేసుకున్నారు.



విజయ కెరటం
తెలుగు దినపత్రిక

ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం చలో ఢిల్లీ.. నల్లగొండ నుంచి రెండు బస్సుల్లో కాంగ్రెస్ శ్రేణుల తరలింపు





నల్లగొండ, అక్టోబర్ 31 (విజయ కెరటం):

ఓటర్ల హక్కులను పరిరక్షించాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వంలో నవంబర్ 1న దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించనున్న చలో ఢిల్లీ నిరసన కార్యక్రమానికి నల్లగొండ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం పార్టీ క్యాంపు కార్యాలయం నుంచి రెండు బస్సుల్లో ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడి నుంచి రాత్రి విమానంలో ఢిల్లీకి బయలుదేరనున్నారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అఫ్రఖ్ అలీ అమేర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్త పోరాటం.. ఛలో ఢిల్లీకి భారీ స్పందన

- **ఎన్ని నిర్బంధాలు విధించినా ప్రజాస్వామ్య పోరాటం ఆగదు -- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

హైదరాబాద్, అక్టోబర్ 31 (విజయ కెరటం):

దేశంలో ఓటర్ల హక్కులను పరిరక్షించాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వంలో ఢిల్లీలో చేపట్టిన ఛలో ఢిల్లీ నిరసన కార్యక్రమానికి దేశవ్యాప్తంగా భారీ స్పందన లభిస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ లక్ష్యంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో ఢిల్లీకి తరలివస్తున్నారని తెలిపారు.బీజేపీ ప్రభుత్వం సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను ప్రతిపక్షాలపై రాజకీయ కక్ష సాధింపు కోసం ఉపయోగిస్తోందని మంత్రి విమర్శించారు. రాజ్యాంగాన్ని మార్చాలన్న బీజేపీ నేతల ఆలోచనలను గతంలో ప్రజలు తమ ఓటుతో తిప్పికొట్టారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఎన్నికల వ్యవస్థను ప్రభావితం చేస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.ప్రతి భారతీయ పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఆ హక్కును హరించే కుట్రలను ప్రజాస్వామ్యవాదులు సహించరని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని, ప్రజల ఓటు విలువను కాపాడటమే ఈ ఉద్యమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

రాహుల్ నాయకత్వంలో మరో సత్యాగ్రహ పోరాటం

మహాత్మా గాంధీ బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా సత్యాగ్రహ మార్గంలో స్వాతంత్ర్య పోరాటం సాగించిన స్ఫూర్తితోనే నేడు రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజాస్వామ్య పోరాటానికి నాయకత్వం వహిస్తున్నారని మంత్రి అన్నారు. ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ పోరాటం కాదని, దేశ భవిష్యత్తును, పౌరుల హక్కులను కాపాడాలనే ప్రతి ఒక్కరి పోరాటమని పేర్కొన్నారు.



ప్రజల స్పందన చూసి కేంద్రం భయపడుతోంది

ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపుతో దేశవ్యాప్తంగా ప్రజలు ఢిల్లీకి తరలివస్తున్నారని తెలిపారు. ఈ ఉద్యమానికి వస్తున్న స్పందనను చూసి కేంద్ర ప్రభుత్వం నిరసనకారులకు రవాణా సదుపాయాల్లో ఆటంకాలు కల్పిస్తూ, నిర్బంధాలకు పాల్పడుతోందని విమర్శించారు.అధికారాన్ని అడ్డుపెట్టుకుని రైళ్లను నిలిపివేయగలరేమో కానీ, ప్రజల ప్రజాస్వామ్య ఆకాంక్షలను అడ్డుకోలేరని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనక్కి తగ్గేది లేదని, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత నెలకొనే వరకు, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తామని వెల్లడించారు.

దేశ సమైక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- **సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపు**

నల్గొండ, అక్టోబర్ 31 (విజయ కెరటం):



దేశ సమైక్యతను, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. భారత ఉక్కుమనిషి, తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతిని పురస్కరించుకొని శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ ఐక్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సర్దార్ వల్లభాయ్ పటేల్ యువకుడిగా ఉన్నప్పటి నుంచే దేశ స్వాతంత్ర్యం కోసం కృషి చేశారని, మహాత్మా గాంధీ పిలుపుతో సహాయ నిరాకరణ, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్నారని తెలిపారు. నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ తదితర నాయకులతో కలిసి స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం సంస్థానాల విలీనంలో భాగంగా 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడంలో పటేల్ చూపిన చొరవను గుర్తు చేశారు.సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలకు గుర్తుగా గుజరాత్‌లోని నర్మదా జిల్లా కెవాడియాలో నర్మదా నది ఒడ్డున స్టాట్యూ ఆఫ్ యూనిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా నల్గొండ జిల్లా నుంచి ఒక ప్రతినిధి బృందం కెవాడియాకు వెళ్లినట్లు వెల్లడించారు. దేశ, ప్రాంత సమైక్యతను దెబ్బతీసే విచ్ఛిన్నకర శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటి ప్రయత్నాలను తిప్పికొడుతూ ఐక్యతను కాపాడాలని పిలుపునిచ్చారు.అనంతరం రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా కలెక్టర్ కార్యక్రమానికి హాజరైన వారితో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, కలెక్టరేట్ ఏఓ మోతిలాల్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో పోలీస్ శాఖ కమర్షియల్ స్థలం అభివృద్ధి, లీజుకు ప్రతిపాదనలు ఆహ్వానం

నల్లగొండ, అక్టోబర్ 31 (విజయ కెరటం):

నల్లగొండ పట్టణంలోని సాగర్ రోడ్డులో ఇషా గ్రాండ్ ఎదురుగా నూతనంగా నిర్మాణంలో ఉన్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, సీసీఎస్ పోలీస్ స్టేషన్ ఆవరణలోని కమర్షియల్ అవసరాలకు అనువైన ఖాళీ స్థలాన్ని అభివృద్ధి చేసి లీజుకు తీసుకునేందుకు ఆసక్తి గల వ్యక్తుల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ తెలిపారు.ఈ స్థలాన్ని వాణిజ్యపరంగా అభివృద్ధి చేసి వినియోగించుకోవాలనుకునే వారు తమ ప్రతిపాదనలను సమర్పించాలని ఎస్పీ సూచించారు. ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థల అభివృద్ధి, లీజుకు సంబంధించిన పూర్తి వివరాల కోసం పోలీస్ శాఖ వెల్ఫేర్ ఆర్ఐ సంతోష్‌ను 8712670169 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.



ఇందిరమ్మకు నీరాజనం!

పటేల్‌కు ఘన నివాళి!

వరంగల్, అక్టోబర్ 31 విజయ కెరటం:



దేశ సమగ్రత, ఐక్యతను కాపాడటంలో ఇందిరాగాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య అన్నారు. దేశం కోసం వారు చేసిన త్యాగాలు, చేపట్టిన సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. వారి ఆశయాలను కొనసాగిస్తూ దేశ ఐక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 42వ వర్ధంతి, భారత ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతిని పురస్కరించుకుని శనివారం వరంగల్ నగరంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు.నగరంలోని 19వ డివిజన్ కాశిబుగ్గ సెంటర్‌లో మాజీ కార్పొరేటర్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ధూపం సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బస్వరాజ్ సారయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.అనంతరం సారయ్య మాట్లాడుతూ ఇందిరాగాంధీ దేశ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి చేసిన కృషి మరువలేనిదని అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ ఐక్యత కోసం చేసిన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పేర్కొన్నారు.అదేవిధంగా వరంగల్ నగరంలోని 23వ డివిజన్ కొత్తవాడలో మాజీ కార్పొరేటర్ దామెర సర్వేశం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బస్వరాజ్ సారయ్య పాల్గొని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమాల అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాల్లో పీసీసీ సభ్యుడు నల్లగొండ రమేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బస్వరాజ్ కుమారస్వామి, మాజీ కార్పొరేటర్లు గుండేటి నరేంద్రకుమార్, బస్వరాజ్ శిరీష శ్రీమాన్, తత్తరి లక్ష్మణ్,జన్ను రవి, డీసీసీ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రాజు, కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు కొరివి పరమేష్, యూత్ కాంగ్రెస్ నాయకుడు వరుణ్, నరగోని మురళీగౌడ్, రామ యాదగిరి, కొమ్ముల సందీప్, మార్తా ఆంజనేయులు, వెల్దండి లక్ష్మణ్, జంజీరాల వేణు, రాముల బాబు, బైరబోయిన చంద్ర మౌళి, కాశెట్టి వేణు, గుట్టికొండ తిరుపతి, బొలుగొడ్డు అనిల్, బత్తుల వినోద్, నరిగె శ్రీనివాస్, కుచన రవీందర్, సింగారపు చిరంజీవి, ఎస్.కె. ఇమ్రాన్, క్యాతం వేణు, వాసుకుల ఉదయ్, ఈసంపల్లి ప్రభాకర్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

విద్యలో మెరిసిన శ్రీవిద్య చిన్నారులు

- **99 శాతం మార్కులతో ప్రతిభా చాటింపు.. విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు**

వరంగల్ అక్టోబర్ 31 విజయ కెరటం :



విద్యారంగంలో శ్రీవిద్య కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. జఫర్గఢ్ పట్టణంలోని హౌసింగ్ బోర్డు, రోడ్డు నంబర్ 5లో ఉన్న శ్రీవిద్య కాన్సెప్ట్ స్కూల్ (ఇంగ్లీష్ మీడియం) రెండో తరగతి విద్యార్థులు పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారు.100కు 99 శాతం వరకు మార్కులు సాధించి చదువుల్లో తమ సత్తా చాటారు.రెండో తరగతిలో ప్రతిభ కనబరిచిన అజ్ఞాని మహమ్మది, నితీష్, రుద్విత్, గాయత్రి, దివిద్య, అనన్య, అలీషా మెహరీన్, వర్ణికలను పాఠశాల ప్రిన్సిపాల్ భారతి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే చదువుపై ఆసక్తి, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించేలా పాఠశాలలో ప్రత్యేక బోధనా పద్ధతులను అమలు చేస్తున్నామని తెలిపారు. చదువుతోపాటు ఆటపాటలు, సృజనాత్మకత, వ్యక్తిత్వ వికాసానికి సమాన ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.అనంతరం క్లాస్ టీచర్ శిరీష మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన ఈ ఫలితాలు ఎంతో ఆనందాన్ని, గర్వాన్ని కలిగిస్తున్నాయని అన్నారు. విద్యార్థుల నిరంతర కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం కలిసివస్తే మరిన్ని ఉన్నత విజయాలు సాధించవచ్చని తెలిపారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ వారి సామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహిస్తున్నామని వివరించారు.పాఠశాలలో నిర్వహిస్తున్న నిరంతర మూల్యాంకనాలు, రాత పరీక్షలు, వివిధ విద్యా కార్యక్రమాలు విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి దోహదపడుతున్నాయని ఉపాధ్యాయులు తెలిపారు. ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ప్రిన్సిపాల్ భారతి, క్లాస్ టీచర్ శిరీష అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.చిన్న వయసులోనే చదువుల్లో ప్రతిభ చాటుతున్న విద్యార్థుల విజయంపై తల్లిదండ్రులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ, సంస్కారం,ఆత్మవిశ్వాసంతో కూడిన విద్యను అందించడమే తమ పాఠశాల లక్ష్యమని శ్రీవిద్య కాన్సెప్ట్ స్కూల్ యాజమాన్యం పేర్కొంది.

34 ఏళ్ల సేవలకు ఘన వీడ్కోలు.. అటెండర్ రాములు పదవీ విరమణ

నల్లగొండ, అక్టోబర్ 31 (విజయ కెరటం):



నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో అటెండర్‌గా గత 34 సంవత్సరాలుగా సేవలందించిన సల్వాది రాములు శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ కార్యాలయంలో నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి కార్పొరేటర్లతో కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. 34 ఏళ్ల పాటు అంకితభావంతో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన రాములు, ఇకపై కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో శేష జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అఫ్రఖ్ అలీ అమేర్, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

12వ బెటాలియన్‌లో ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం

- **వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం**

అన్నేపర్తి, అక్టోబర్ 31 (విజయ కెరటం):



12వ తెలంగాణ ప్రత్యేక పోలీస్ బెటాలియన్, అన్నేపర్తిలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని (ఏక్తా దివస్) కమాండెంట్ బి. రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భారత ఉక్కు మనిషి, మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి కమాండెంట్ బి. రామకృష్ణ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బెటాలియన్ అధికారులు, సిబ్బంది, ఇతర ఉద్యోగులతో జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు.పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సోలేషన్ బహుమతులు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరరావు, అసిస్టెంట్ కమాండెంట్లు నర్సింగ్ వెంకన్న, సుదర్శన్ రెడ్డి, ఏవో దయాకర్, డాక్టర్ షర్మిలా దేవి, నితిన్ గౌతం, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, మినిస్టీరియల్ సిబ్బంది, హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు.జాతీయ ఐక్యత, సమగ్రత, దేశభక్తి భావాలను ప్రతి ఒక్కరిలో పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక

మాజీ AISF నాయకుడు విద్యాసాగర్ రెడ్డి మృతి

పట్ల పలువురి సంతాపం

అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించిన నాయకులు



నల్గొండ: విజయ కెరటం మాజీ AISF జిల్లా నాయకుడు చిలుక విద్యాసాగర్ రెడ్డి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడం పట్ల ISCUF రాష్ట్ర అధ్యక్షులు కడారి ప్రభాకర్ రావు సంతాపం వ్యక్తం చేశారు. శనివారం నిర్వహించిన విద్యాసాగర్ రెడ్డి అంతిమయాత్రలో పలువురు ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ మల్లేపల్లి ఆదిరెడ్డి, ISCUF రాష్ట్ర ఉపాధ్యక్షులు కారింగు బిక్షమయ్య గౌడ్, కోశాధికారి విజయలక్ష్మి, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిప్పర్తి యాదయ్య, ఎల్. శ్రవణ్ కుమార్, అడ్వకేట్ గుర్రం వెంకట్ రెడ్డి, బరిగెల వెంకటేష్, కట్ట వెంకటరెడ్డి, నాకిరేకంటి సైదులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.విద్యార్థి దశ నుంచే విద్యాసాగర్ రెడ్డితో కలిసి విద్యార్థుల సమస్యలపై అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించిన విషయాన్ని కారింగు బిక్షమయ్య గౌడ్ గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి విద్యార్థి ఉద్యమానికి తీరని లోటని పేర్కొంటూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గత నెలలో నిర్వహించిన నల్గొండ జిల్లా ISCUF (ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కోఆపరేషన్ అండ్ ఫ్రెండ్‌షిప్) మహాసభలో విద్యాసాగర్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారని కోశాధికారి విజయలక్ష్మి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ISCUF కార్యకలాపాలను విస్తరిస్తామని ఆయన ప్రకటించిన కొద్ది రోజులకే ఈ విషాద సంఘటన చోటుచేసుకోవడం బాధాకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

నల్గొండ కార్పొరేషన్‌లో అన్ని డివిజన్ల అభివృద్ధే లక్ష్యం

- **పార్టీలకతీతంగా ప్రతి డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి -- మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి**



నల్గొండ, అక్టోబర్ 31 (విజయ కెరటం):

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లను పార్టీలకతీతంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి తెలిపారు.శనివారం నిర్వహించిన సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో నగరంలో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. డివిజన్లలో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు తమ డివిజన్ల పరిధిలోని కాలనీల్లో నెలకొన్న సమస్యలను మేయర్ దృష్టికి తీసుకురాగా, వాటన్నింటినీ పరిష్కరిస్తామని ఆమె భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ మహమ్మద్ అఫ్రోజ్ అలీ అమీర్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నల్గొండ జిల్లాలో అతిథి ప్రత్యేక విద్యా బోధకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నవంబర్ 5 దరఖాస్తులకు చివరి గడువు

నల్గొండ, అక్టోబర్ 31 (విజయ కెరటం):

నల్గొండ జిల్లాలోని 34 పీఎం శ్రీ పాఠశాలల్లో అతిథి ప్రత్యేక అవసరాల విద్యా బోధకుల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. ఈ నియామకాలు పూర్తిగా తాత్కాలిక, స్వల్పకాలిక ప్రాతిపదికన చేపడుతున్నట్లు వెల్లడించారు. మార్చి 2027 వరకు ఐదు నెలల పాటు పనిచేసేందుకు ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.16,500 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. డిగ్రీతో పాటు ప్రత్యేక విద్యలో బీఈడీ, జనరల్ బీఈడీతో ప్రత్యేక విద్యలో పీజీ ప్రొఫెషనల్ కోర్సు లేదా డిప్లొమా, సంబంధిత వైకల్యాల్లో ప్రత్యేక విద్యా అర్హతలు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దృష్టిలోపం, వినికిడి లోపం, మానసిక, బహుళ, చలన వైకల్యాలు, మస్తిష్క పక్షవాతం తదితర విభాగాల్లో నిర్దేశిత అర్హతలు ఉన్నవారు కూడా దరఖాస్తుకు అర్హులని తెలిపారు.స్థానిక గ్రామం లేదా మండలానికి చెందిన అభ్యర్థులకు మెరిట్ ఆధారంగా ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, అనుభవం ఉన్నవారికి అదనపు ప్రాధాన్యత కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. ఎంపికైన వారు కేటాయించిన భవిత కేంద్రం లేదా పాఠశాలలో విధులు నిర్వహిస్తూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవసరమైన సేవలు అందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.ఖాళీల వివరాలను ఆయా మండల విద్యాశాఖ అధికారుల వద్ద తెలుసుకోవచ్చని సూచించారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు సంబంధిత పాఠశాల ఉన్న మండల విద్యాశాఖ అధికారికి స్వయంగా దరఖాస్తు సమర్పించాలి. దరఖాస్తుతో పాటు విద్యార్హతల ధ్రువపత్రాలు, ఎస్ఎస్సీ సర్టిఫికెట్, ఆర్‌సీఐ రిజిస్ట్రేషన్, స్థానిక, నివాస ధ్రువపత్రాలు, సంబంధిత అర్హత పత్రాల జిరాక్స్ కాపీలు జత చేయాలని సూచించారు.నవంబర్ 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు సమర్పించాలి. చివరి తేదీ తర్వాత అందిన దరఖాస్తులను స్వీకరించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రత్యేక కమిటీ అభ్యర్థుల ధ్రువపత్రాలు, ఆర్‌సీఐ రిజిస్ట్రేషన్ పరిశీలించిన అనంతరం నియామకాలు చేపడుతుందని తెలిపారు.

మద్యం కోసం డబ్బులు ఇవ్వలేదని కన్నతండ్రిని గొడ్డలితో నరికి చంపిన కుమారుడు

నల్లగొండలో దారుణ హత్య.. హనుమాన్ నగర్‌లో ఘటన

నల్లగొండ, అక్టోబర్ 31 (విజయ కెరటం):



మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదనే కోపంతో కన్నతండ్రినే గొడ్డలితో నరికి చంపిన ఘటన నల్లగొండ పట్టణంలోని హనుమాన్ నగర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. హనుమాన్ నగర్‌కు చెందిన గొర్ల కాపరి సురిగిల లింగయ్య (70)పై ఆయన కుమారుడు గణేష్ (35) శనివారం మధ్యాహ్నం గొడ్డలితో దాడి చేశాడు. మద్యానికి బానిసైన గణేష్ నిత్యం తండ్రితో గొడవ పడుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో మద్యం కోసం డబ్బులు ఇవ్వాలని తండ్రిని అడగగా, ఈ విషయమై ఇద్దరి మధ్య వివాదం తలెత్తినట్లు ప్రాథమిక సమాచారం. దీంతో ఆగ్రహానికి గురైన గణేష్ ఇంటి వద్ద గొర్రెలకు మేత కోసం చెట్లు నరికేందుకు ఉపయోగించే గొడ్డలితో తండ్రిపై దాడి చేశాడు. తీవ్ర గాయాలపాలైన లింగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు.సమాచారం అందుకున్న నల్లగొండ వన్‌టౌన్ ఎస్సై ముత్తయ్య ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సర్దార్ పటేల్ ఆశయాలే దేశ ఐక్యతకు స్ఫూర్తి

దేశ సమైక్యత, సమగ్రత, అంతర్గత భద్రత పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్గొండ, అక్టోబర్ 31 (విజయ కెరటం):



భారత ఉక్కుమనిషి, స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో జాతీయ ఐక్యత దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ సర్దార్ వల్లభభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన సర్దార్ వల్లభభాయ్ పటేల్, స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని సంస్థానాలను ఏకం చేసి సమైక్య భారత నిర్మాణానికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయన దృఢ సంకల్పం, నాయకత్వ లక్షణాలు, దేశం పట్ల అంకితభావం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వం, అంతర్గత భద్రతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యతని స్పష్టం చేశారు. కుల, మత, ప్రాంత, భాషా భేదాలకు అతీతంగా ప్రజలంతా సోదరభావంతో మెలగాలని, దేశ అభివృద్ధి, శాంతిభద్రతలు, సామాజిక సామరస్యానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. పోలీస్ సిబ్బంది ప్రజల భద్రతతో పాటు దేశ అంతర్గత భద్రత పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఆశయాలు, ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకొని జాతీయ సమైక్యతను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ కోరారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఏవో శివప్రసాద్, ఎస్బీ డీఎస్పీ మల్లారెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు, ఆర్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేసుల్లో నేర నిరూపణ శాతం పెంచేలా సమన్వయంతో పనిచేయాలి

- **కోర్టు డ్యూటీ అధికారులకు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచన**

నల్గొండ, అక్టోబర్ 31 (విజయ కెరటం):



కోర్టుల్లో విచారణకు వచ్చే కేసుల్లో నిందితులకు చట్టప్రకారం శిక్షలు పడేలా నేర నిరూపణ (కన్విక్షన్) శాతాన్ని పెంచేందుకు కోర్టు డ్యూటీ అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ సూచించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కోర్టు డ్యూటీ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రతి కేసులో దర్యాప్తు సమయంలో సేకరించిన ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు, కీలక పత్రాలను సక్రమంగా కోర్టులో సమర్పించేలా దర్యాప్తు అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. కోర్టు సమన్లు, వారెంట్ల అమలులో జాప్యం లేకుండా చూడటంతో పాటు సాక్షులు నిర్ణీత సమయానికి కోర్టుకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.కేసుల విచారణ పురోగతి, తదుపరి విచారణ తేదీలు, కోర్టు ఆదేశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో ముందస్తు సమన్వయం చేసుకుంటూ విచారణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో కేసుల్లో బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.కేసుల విచారణలో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించడంతో పాటు కన్విక్షన్ శాతం పెంపునకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. నేర నిరూపణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులను అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో పనిచేసి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రమేష్, సీఐలు శ్రీను నాయక్, బీహన్న, సంబంధిత పోలీస్ అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ బస్ డ్రైవర్లపై కక్షపూరిత చర్యలు మానుకోవాలి

వేతనాలు పెంచాలని డిమాండ్.. మూడు గంటల పాటు బస్సులు నిలిపివేసి నిరసన

నల్లగొండ, అక్టోబర్ 31 (విజయ కెరటం):



నల్లగొండ ఆర్టీసీ డిపోలో ఎలక్ట్రికల్ బస్సులు నడుపుతున్న డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని, వారిపై యాజమాన్యం కక్షపూరిత చర్యలు మానుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ సలీం డిమాండ్ చేశారు. డ్రైవర్లకు వేతనాలు పెంచడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం తెల్లవారుజామున 4 గంటల నుంచి మూడు గంటల పాటు ఎలక్ట్రికల్ బస్సులను నిలిపివేసి డ్రైవర్లు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా నల్లగొండ డిపో ఎదుట జరిగిన నిరసనలో ఎండీ సలీం మాట్లాడుతూ.. 16 నెలలుగా పనిచేస్తున్న ఎలక్ట్రికల్ బస్ డ్రైవర్లు తమ వేతనాల పెంపు, ఇతర సమస్యల పరిష్కారం కోసం యూనియన్ ఏర్పాటు చేసుకున్నప్పటి నుంచి జేబీఎం సిస్కాన్ మ్యాన్‌పవర్ సంస్థ ప్రతినిధులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి తప్పులు చేయని డ్రైవర్లకు విధులు కేటాయించకుండా వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు.సూర్యాపేట, వరంగల్ డిపోలలో పీఎఫ్, ఈఎస్ఐతో కలిపి రూ.26 వేల వేతనం చెల్లిస్తుండగా, నల్లగొండలో మాత్రం రూ.20 వేలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. వేతనాల పెంపు, ఇతర సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా యాజమాన్యం స్పందించడం లేదన్నారు. యూనియన్ నాయకులుగా ఉన్న డ్రైవర్లను లక్ష్యంగా చేసుకుని విధులు నిలిపివేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.విధులు నిలిపివేసిన సోమయ్య, మురళి, కృష్ణారెడ్డితో పాటు మరో 15 మంది డ్రైవర్లను వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, వేతనాలు పెంచి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.డ్రైవర్ల నిరసన నేపథ్యంలో జేబీఎం సిస్కాన్ నల్లగొండ డిపో ప్రతినిధులు సాయికిరణ్, కత్తుల యాదయ్య జోక్యం చేసుకుని హెడ్ ఆఫీస్ ప్రతినిధులతో మాట్లాడారు. నవంబర్ 4న జాయింట్ సమావేశం ఏర్పాటు చేసి వేతనాలు, ఇతర సమస్యలపై చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో డ్రైవర్లు నిరసన విరమించి యథావిధిగా విధుల్లో చేరారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య, ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నల్లగొండ డిపో అధ్యక్షుడు కాసాన్ రమేష్, కార్యదర్శి పొట్టపాంగి గణేష్, కోశాధికారి పూల సోమన్న నాయుడు, ఉపాధ్యక్షుడు సింగపంగా మురళి, మచ్చ నాగార్జున, జల్లుల వీరారెడ్డి, బొడ్డుపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

2023 బ్యాచ్ జూనియర్ లెక్చరర్ల ప్రొబేషన్ పీరియడ్‌ను వెంటనే ప్రకటించాలి..

ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం డిమాండ్..

హైదరాబాద్ అక్టోబర్ 31 విజయ కెరటం

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 2023 బ్యాచ్ లెక్చరర్స్ యొక్క ప్రొబేషన్ డిక్లరేషన్‌ను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ, గుంటి రవి డిమాండ్ చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 2023లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న అధ్యాపకులందరినీ రెగ్యులరైజ్ చేసిన సంగతి తెలిసిందే. అయితే, రెగ్యులరైజేషన్ ప్రక్రియ పూర్తయి దాదాపు నాలుగేళ్లు కావస్తున్నా వారికి అందాల్సిన ఎలాంటి ఆర్థిక, సేవా బెనిఫిట్స్ ఇప్పటివరకు అందకపోవడం శోచనీయమని వారు పేర్కొన్నారు.ఈ సమస్యలపై ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిని, ఇంటర్ విద్యాశాఖ కార్యదర్శిని పలుమార్లు కలిసి విన్నవించినా ఎలాంటి ప్రయోజనం లేకపోయిందని వారు వాపోయారు. కనీసం రెండు, మూడు ఇంక్రిమెంట్లు కూడా ఇవ్వకుండా అధ్యాపకులను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి ఈ అంశంపై పునఃపరిశీలన చేసి తగిన న్యాయం చేయాలని కోరారు.

బాధిత కుటుంబాలకు అందని ద్రాక్షగా కారుణ్య నియామకాలు..

2023లో రెగ్యులర్ అయిన అధ్యాపకులలో చాలామంది గుండెపోటు మరియు ఇతర వ్యాధులతో మరణించారని, కానీ వారి కుటుంబాలకు ఎలాంటి భరోసా గానీ, ఆర్థిక లాభాలు గానీ, కారుణ్య నియామకాలు గానీ అందకపోవడం అత్యంత దురదృష్టకరమని సంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. బోధనా పద్ధతుల విషయానికి వస్తే సీసీఏ రూల్స్ ప్రకారం వెట్టిచాకిరి చేయించుకుంటున్న అధికారులు, మరి అదే రూల్స్ ప్రకారం అధ్యాపకులకు రావాల్సిన హక్కులను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.అధ్యాపకుల విద్యా అర్హతలపై వస్తున్న ఆరోపణలను సరైన నిజనిర్ధారణ చేయకుండా మొత్తం ఇంటర్మీడియట్ వ్యవస్థనే రోడ్డున పడేయాలని చూస్తే, రాబోయే రోజుల్లో జరిగే పరిణామాలకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రభుత్వం, విద్యాశాఖ తక్షణమే స్పందించి అధ్యాపకుల సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు కరుణాకర్, జనార్దన్, వినోద్, విష్ణు ప్రసాద్, ఫైనాన్స్ సెక్రటరీ డి. ప్రవీణ్ కుమార్, రవీందర్, ఒకేషనల్ రాష్ట్ర కార్యదర్శి రవీందర్, వాల్యా నాయక్, తిరుపతి రావు, కృష్ణాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.



Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528